

స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, పక్కన ఎస్పీ, జేసీ


ప్రథమ బహుమతి పొందిన విద్యుత్ శాఖ శకటం

- ఘనంగా గణతంత్ర వేడుకలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు
- ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు


నృత్య ప్రదర్శనలో ప్రథమ బహుమతి సాధించిన గార కేజీబీవీ విద్యార్థినులు

మది నిండా..! మువ్వన్నెల జెండా


శ్రీకాకుళంలో జెండా వందనం చేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

గణతంత్ర వేడుక వేళ సిక్కోలు.. మువ్వన్నెల జెండా రెపరెపలతో మురిసింది. శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో సాయుధ దళాల కవాతుల నడుమ.. 'భారత్ మాతాకీ జై' అనే నినాదం హోరెత్తింది. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలతో ఆహూతుల మదినిండా దేశభక్తి ఉప్పొంగింది. ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన శకటాల ప్రదర్శన ప్రభుత్వ పనితీరుకు అద్దం పట్టింది. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఉత్తమ సేవలందించిన 235 మంది ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబాలను సత్కరించారు. 'స్వర్ణాంధ్ర' విజన్ లక్ష్యంగా.. జిల్లా అభివృద్ధికి కలిసికట్టుగా పని చేద్దామని జిల్లా అధికారులకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు.


శ్రీకాకుళం కలెక్టరేట్/అర్బన్/ కల్చరల్

4లో


పోలీసు కవాతు


ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..



మౌలిక సౌకర్యాలకు నోచక.. కనీస వసతులు కానరాక ప్రజలు అనేక ఇబ్బందులతో సతమతం కావడం చూస్తున్నాం. సమస్యలు, అవస్థలతో ఏళ్లుగా సహవాసం చేస్తుండడం గమనిస్తూనే ఉన్నాం. అధికారులకు, నేతలకు విన్నపాలు ఇచ్చి.. వారి చుట్టూ తిరిగి విసిగి వేసారిపోయే వారెందరో. తాగునీటి కుళాయి కావాలని అడిగి అడిగి అలసిపోయి ఇక తన పాట్లు ఏవో తాను పడతానని నిర్ణయించుకుని నిస్పృహలో బతుకు తున్న వారు కోకొల్లలు. అలాంటి వారి ఆవేదనను తీర్చాలని.. సగటు పౌరులకు ప్రభుత్వం నుంచి కనీస సేవలు అందాలని.. మౌలిక సౌకర్యాలు సమకూరాలని "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్" ఆకాంక్షిస్తోంది. అందులో భాగంగా వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. "అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా" పేరుతో ప్రజా సమస్యలను గుర్తించడంతో పాటు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలని నిర్ణయించింది.

- శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి

గిరిజనుల పంట పండిందోచ్!


గూడలో ఎండబెడుతున్న చింతపండు (ఫైల్)

- అటవీ ఉత్పత్తుల ధరలు పెంచిన ప్రభుత్వం
- జిల్లాలో 35 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- పంటలు సేకరించేందుకు సిద్ధమవుతున్న జీసీసీ

మెళియాపుట్టి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గిరిజనులకు మంచి రోజులు వచ్చాయి. ఇప్పటికే ప్రభుత్వం గిరి శిఖర గ్రామాలకు రోడ్లు వేయడంతో పాటు వివిధ సదుపాయాలు కల్పిస్తోంది. తాజాగా అటవీ ఉత్పత్తులకు మద్దతు ధర కల్పిస్తుండ డంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తు న్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అటవీ ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధర లు ఉండేవి కావు. గిరిజనులు ఏడాది పాటు కష్టపడి కొండలపై పంటలు సాగు చేస్తే కనీస మద్దతు ధరకు జీసీసీ కొనుగోలు చేసేది కాదు. దీంతో అడవి బిడ్డలు వలసలు పోయేవారు. ఫలితంగా పోడు వ్యవసాయం తగ్గిపోయింది. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే గిరిజన సమస్యలపై దృష్టి సారించింది. ముఖ్యంగా అటవీ ఉత్పత్తుల విషయా న్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి జీసీసీ (మిగతా 4వ పేజీలో..)

మెళియాపుట్టి మండలం జంతూరు వద్ద కొండపై 25 హెక్టార్ల విస్తీర్ణంలో సుమారు 80 నుంచి 150 వరకు కుంకుడు చెట్లు ఉన్నాయి. ఈ కుంకుడు కాయలను స్థానిక గిరిజనులు సేకరించి జీసీసీకి విక్రయిస్తుంటారు. గతేడాది కిలో కాయలు రూ.20కు జీసీసీ కొనుగోలు చేసింది. దీనివల్ల గిరిజనులకు గిట్టుబాటు కాలేదు. కుంకుడు కాయలు సేకరించి వాటిని ఎండ బెట్టితే కష్టానికి తగ్గ ధరలు రావడం లేదని వారు ఆవేదన చెందారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కుంకుడు కాయల ధరను కిలో రూ.35కు పెంచింది. దీంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మెళియాపుట్టి మండలం గూడ గ్రామ సమీపంలోని ఉమ్మడి కొండపై సుమారు 200 చింత చెట్లు ఉన్నాయి. గతేడాది గిరిజనులు ఈ చెట్ల నుంచి చింత పండును సేకరించి జీసీసీకి విక్రయించారు. కిలోకు రూ.25 వరకు జీసీసీ చెల్లించింది. ధర తక్కువగా ఉండడంతో చాలా మంది గిరిజనులు చింతపండును చెట్లకే వదిలేశారు. బయట కూలికి వెళితే రోజుకు రూ.700 వస్తుందని, అదే చింత పండును ఏరి, ఎండబెట్టి విక్రయిస్తే రోజుకు రూ.400 మాత్రమే గిట్టుబాటు అవుతుందని గిరిజనులు చెబుతున్నారు. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే జీసీసీ చింత పండు ధరను పెంచింది. గిరిజనుల నుంచి కిలో రూ.34కు కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతోంది.

ఆనందంగా ఉంది

గతంలో నేను అటవీ ఉత్పత్తులను సేకరించి జీసీసీకి విక్రయించేవాడిని. కానీ, సరైన ధరలు ఉండేవి కావు. దీంతో గిట్టుబాటు కాకపోవడంతో అటవీ ఉత్పత్తులను సేకరించడం మానేశాను. టెక్కలి ప్రాంతానికి కూలి పనికి వెళ్తున్నాను. కూటమి ప్రభుత్వం ధరలు పెంచటం ఆనందంగా ఉంది. దీనివల్ల అటవీ పంటల ద్వారా డబ్బులు సంపాదించే అవకాశం ఉంటుంది.

- లక్ష్మీనారాయణ, ఎగువబందపల్లి, మెళియాపుట్టి





పసిడికి రెక్కలు!

- 10 గ్రాముల ధర రూ.83వేలు
- 2020లో రూ.40 వేలు
- 99.9 స్వచ్ఛత బంగారం తులం రూ.97వేలు
- సామాన్యులకు అందని స్థాయిలో పరుగులు
- మదుపరులకు కలిసొస్తున్న ధరలు

4లో

సెలవులకు వచ్చి... విగతజీవులుగా మారి!

- వంశధార నదిలో మునిగి... ఇద్దరి మృతి
- కళింగపట్నంలో విషాదం


దేవీప్రసాద్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు


కృష్ణచైతన్య, దేవీ ప్రసాద్(ఫైల్)

గార, జనవరి 26(ఆంధ్రజ్యోతి): సెలవులకు సొంత ఊరికి వచ్చారా యువకులు. స్నేహితులతో కలిసి.. సరదాగా వంశధార నదిలో స్నానానికి వెళ్లారు. ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి మృత్యువాత పడ్డారు. ఈ సంఘటనతో కళింగపట్నంలో విషాదఛాయలు అలముకున్నాయి. అంతవరకూ తమతో పాటే ఉన్న మిత్రులిద్దరూ అంతలోనే ప్రాణాలు కోల్పోవడంతో సహచరులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కళింగపట్నానికి చెందిన పొట్నూరు కృష్ణచైతన్య (29), ముంత దేవీప్రసాద్(20) మిత్రులతో కలిసి ఆదివారం ఉదయం గ్రామం పక్కనే ఉన్న వంశధార నదిలో స్నానానికి వెళ్లారు. అక్కడ స్నానాలు చేస్తున్న ప్రదేశం లోతుగా ఉండడం.. ఈత రాకపోవడంతో ఇద్దరూ మునిగిపోయారు. ఈ హఠాత్పరిణామంతో వారి మిత్రులు ఆందోళనకు గురయ్యారు. స్థానికులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు నది వద్దకు వచ్చేసరికే ఇద్దరూ విగతజీవులుగా మారారు. చేతికి అందివచ్చిన కొడుకులు ఇలా అర్ధాంతరంగా కన్ను మూయడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోదన వర్ణనాతీతం. రెండు కుటుంబాల వారూ తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

- కళింగపట్నానికి చెందిన పొట్నూరు నాగేశ్వరరావు, ఉమామహేశ్వరి దంపతుల కుమారుడు కృష్ణచైతన్య సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తూ ఇటీవల సెలవులకు గ్రామానికి వచ్చాడు. అతనికి భార్య, ఎనిమిది నెలల వయస్సు గల కుమార్తె ఉన్నారు. అదే గ్రామంలోని యాతపేట కాలనీకి చెందిన ముంత పైడిరాజుకు ఒక్కగానొక్క కుమారుడు దేవీ ప్రసాద్ సీమెన్‌గా పని చేస్తూ.. సెలవుపై ఈ నెల ఒకటిన ఇంటికి వచ్చాడు. అతని తల్లి అనారోగ్యంతో ఇటీవలే మరణించింది. ఇంతలోనే కుమారుడూ కన్ను మూయడాన్ని అతని తండ్రి తట్టుకోలేకపోతున్నాడు. సమాచారం అందుకున్న గార ఎస్ఐ ఆర్.జనార్దనరావు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కృష్ణచైతన్య తండ్రి నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దరాప్తు చేస్తున్నారు.

వేతనదారులకు 'ఉపాధి' పెంపు!

- ఇకపై కనీస వేతనం రూ.300 వర్తించేలా చర్యలు



సోంపేట, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ కూలీలకు కూటమి ప్రభుత్వం కనీస వేతనాన్ని పెంచుతూ తీపికబురు అందించింది. ఇప్పటివరకూ దినసరి కూలి రూ.263 ఉండగా, దానిని రూ.300కు పెంచేందుకు ప్రత్యేక విభాగాన్ని నియమించింది. మరోవైపు బోగస్ మస్తర్లు అడ్డుకట్టకు చర్యలు చేపడుతోంది. జిల్లాలో 3,79,650 జాబ్‌కార్డులు ఉండగా.. 6,02,929 మంది వేతనదారులు ఉన్నారు. వీరంతా ప్రస్తుతం ఉదయం, సాయంత్రం కలిపి 4 గంటలు పనిచేస్తున్నారు. మరో గంటపాటు పని పెంచి.. వారికి కనీస వేతనం రూ.300 గిట్టుబాటు అయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. వేతనదారులు పని చేయడానికి అనువుగా ఉండే ప్రదేశాలను గుర్తించాలని సూచించింది. కూలీల పనివేళలు, కొలతలు పారదర్శకంగా లెక్కించి వేతన రసీదులు కచ్చితంగా ఇవ్వాలని ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు కనీస వేతనం రూ.300 అందాలంటే ఉపాధి పనులను ఎంత సమయంలో చేయాలనే అంశాలపై జిల్లాస్థాయిలో ఏర్పాటుచేసిన వేతన పర్యవేక్షణ విభాగం పరిశీలిస్తుంది. అధికారులు జిల్లా యూనిట్‌గా తీసుకొని ముందస్తుగా అంచనాలను రూపొందించి పనులు కల్పించనున్నారు. కూలీలకు అనువుగా పనివేళల్లో మార్పు చేసి.. నిత్యం సాంకేతిక సహాయకులు పర్యవేక్షించనున్నారు. మరోవైపు కొంతమంది వేతనదారులు పనులకు హాజరు కాకపోయినా బోగస్ మస్తర్ల ద్వారా వేతనాలు స్వాహా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ అక్రమాలకు అరికట్టేందుకు ఉపాధి సిబ్బంది, ఏపీడీలు, ఏపీవోలు, ఎంపీడీవోలు నిత్యం మస్తర్ల తనిఖీ చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ విషయమై సోంపేట ఏపీవో ప్రమీల వద్ద ప్రస్తావించగా.. 'ఉపాధిహామీ కూలీలకు దినసరి వేతనం రూ.300 అందేలా పనివేళలు సవరిస్తాం. ప్రభుత్వ లక్ష్యం మేరకు కనీస వేతనం వర్తించేలా.. రోజుకు 4గంటల నుంచి 5గంటల పాటు పని చేసేలా చర్యలు చేపడుతున్నాం. పనుల కల్పన విషయమై క్షేత్రస్థాయి సిబ్బందికి ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నామ'ని తెలిపారు.

మది నిండా.. మువ్వన్నెల జెండా

- ఘనంగా గణతంత్ర వేడుకలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- ప్రగతిని చాటిచెప్పిన శకటాల ప్రదర్శనలు


డ్రోన్‌తో జాతీయ జెండా ప్రదర్శన

శ్రీకాకుళం కలెక్టరేట్/అర్బన్/కల్చరల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకలను ఆదివారం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ జాతీయ పతాకాన్ని ఎగురవేసి, పోలీసు దళాల గౌరవ వందనాన్ని స్వీక రించారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డితో కలిసి ప్రత్యేక వాహనంలో పోలీసుల పరేడ్‌ను పరిశీలించారు. జిల్లాలో ఉత్తమ సేవలందించిన 235 మంది ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలను సత్కరించారు. కోటబొమ్మాళి మండలం చిట్టివలసకు చెందిన కూరాకుల జయలక్ష్మి, తిలారుకు చెందిన మంత్రి అప్పలరామయ్య, కొత్తపేటకు చెందిన వైశ్యరాజు నరసింగరాజు, పోలాకి మండలం అంపలాం గ్రామానికి చెందిన నల్లాన కృష్ణవేణికి జ్ఞాపికలు అందజేశారు.

● దేశభక్తిని చాటిచెప్పిన నృత్య ప్రదర్శనలు..

జాతీయభావం ఉప్పొంగేలా... దేశభక్తిని పెంపొందించేలా... సందేశాత్మకంగా సాగిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. గార కేజీబీవీ విద్యార్థులు ప్రదర్శించిన 'సివంగివే' అంటూ సాగిన నృత్యానికి ప్రథమ బహుమతి లభించింది. న్యూ సెంట్రల్ స్కూల్ విద్యార్థుల ప్రదర్శన, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా సందేశాత్మకంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో 'సంకల్పం' నృత్య ప్రదర్శనకు ద్వితీయ బహుమతి దక్కింది. ఐటీడీఏ విద్యార్థులు ప్రదర్శించిన థింసా నృత్యానికి తృతీయ బహుమతి లభించింది.

● ప్రగతిని ప్రతిబింబించిన శకటాలు..

రాష్ట్ర ప్రగతిని, సంక్షేమాన్ని చాటిచెప్పేలా ప్రభుత్వ శాఖల శకటాలు ప్రదర్శించారు. విద్యుత్తు శాఖ శకటానికి ప్రథమ బహుమతి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ శకటానికి ద్వితీయ బహుమతి, డ్వామా శకటానికి తృతీయ బహుమతి లభించాయి. సంబంధిత అధికారులకు కలెక్టర్ బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, ఎమ్మెల్యే గొండు శంకర్, ఏఎస్పీ కె.వి.రమణ, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వేంకటేశ్వరరావు, ఆర్డీవో సాయి ప్రత్యూష, ఉప కలెక్టర్ పద్మావతి, డీపీవో భారతి సౌజన్య, డీఎస్పీలు వివేకానంద, శేషాద్రి, శ్రీకాకుళం తహసీల్దారు ఎం.గణపతిరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.


ప్రదర్శన తిలకిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్


స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న కలెక్టర్



శ్రీకాకుళం విద్యార్థుల ప్రదర్శన


పాతపట్నం: డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఆశ్రమ పాఠశాల విద్యార్థినుల ప్రదర్శన



'స్వర్ణాంధ్ర' లక్ష్యంగా పనిచేద్దాం

- రాష్ట్రంలో జిల్లాను అగ్రగామిగా నిలుపుదాం
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్/అర్బన్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర - 2047 విజన్ లక్ష్యంగా అందరం కలిసికట్టుగా పనిచేద్దామని జిల్లా అధికారులకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుదామని, ఉద్యోగ, ఉపాధి కల్పనతో పాటు రైతుల ఆదాయాన్ని పెంచుతూ, మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేద్దామన్నారు. 'జిల్లాలో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యమిచ్చాం. రబీలో ఇప్పటివరకూ 7071 క్వింటాళ్ల విత్తనాలు రూ.285 లక్షల సబ్సిడీతో 13,895 మంది రైతులకు అందించాం. 25,586 మెట్రిక్ టన్నుల ఎరువును సరఫరా చేశాం. 21,200 ఎకరాల్లో మందుల పిచికారీకి డ్రోన్ సాంకేతికతను వినియోగించాం. రూ.877కోట్ల పంట రుణాలను అందజేశాం. జిల్లాలో 912 గ్రామ పంచాయితీలకు నీటి సరఫరా చేస్తున్నాం. జలజీవన్ మిషన్ ద్వారా 2,22,514 గృహాలకు తాగునీరు అందించాం. ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ద్వారా స్వచ్ఛ శ్రీకాకుళానికి కృషి చేస్తున్నాం. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తున్నాం. జిల్లాలో 7 అన్నా క్యాంటీన్ల ద్వారా రూ.5కే భోజనం అందిస్తున్నాం. స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ద్వారా జాబ్‌మేళాలు నిర్వహించి 1,818 ఉద్యోగ అవకాశాలు కల్పించాం. 4.74 లక్షల మంది ఉపాధి హామీ వేతనదారులకు పని కల్పించాం. రూ.31కోట్ల నిధులతో 938 కిలోమీటర్ల మేర రోడ్ల మరమ్మతులు పూర్తి చేసి గుంతలు లేని రహదారులు నిర్మిస్తాం. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించడంలో ఉద్యోగులు కీలక భాగస్వాములు కావాల'ని కలెక్టర్ కోరారు. ఈ సందర్భంగా ఉత్తమ ఎన్నికల అధికారిగా అవార్డు సాధించిన కలెక్టర్‌కు ఎస్పీ మహేశ్వరరెడ్డి జ్ఞాపికను అందజేసి దుశ్శాలువతో సత్కరించారు.


ఐటీడీఏ విద్యార్థుల థింసా నృత్యం


ద్వితీయ బహుమతి పొందిన స్త్రీ,శిశు సంక్షేమ శాఖ శకటం


తృతీయ బహుమతి పొందిన డ్వామా శకటం

కూర్మనాథుని సన్నిధిలో అదనపు డీజీపీ

గార, జనవరి 26(ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మంలోని కూర్మనాథ్ స్వామివారిని ఆదివారం అడిషినల్ డీజీపీ (గ్రేహౌండ్స్) ఆర్‌పీ మీనా కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అలాగే జిల్లా అదనపు న్యాయమూర్తి ఫణికుమార్ దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. వేద పండితులు ఆశీర్వచనం చేశారు. స్వామివారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని ఈవో గురునాథరావు వారికి అందజేశారు.


అదనపు డీజీపీ మీనాకు స్వామి వారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో గురునాథరావు

ఆధ్యాత్మిక చింతన అవసరం

కాశీబుగ్గ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని పద్మనాభానంద స్వామి అన్నారు. ఆదివారం కాశీబుగ్గలో 49వ తెలుగు రాష్ట్ర మహాసభల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన పూర్వీకులు అనుసరించిన సంస్కృతి, సంప్రదాయాలను ప్రస్తుత తరం పాటించి... రాబోయే తరాలకు అందించాలని సూచించారు. నిత్యం దైవ నామస్మరణ చేస్తే మనస్సు నిర్మలంగా ఉంటుందని అన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు యోగాసనాలు, భగవద్గీత పారాయణం, వేదపఠనం చేయించారు. అన్న ప్రసాద వితరణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామీజీలకు కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, అశోక్ కుమార్, మురళి, రామలింగేశ్వర రావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల పంట పండిందోచ్!

(మూడో పేజీ తరువాయి)

అధికారులు తీసుకెళ్లడంతో వాటి ధరల పెంపునకు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు గిరిజన గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి అటవీ ఉత్పత్తుల ధరల పెంపు విషయాన్ని రైతులకు తెలియజేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. జిల్లాలో 35 కేంద్రాలు ఏర్పాటు చేసి జీసీసీ ద్వారా గిరిజనుల పంటలను కొనుగోలు చేయాలని భావిస్తున్నారు. మందస, హిరమండలం, పాతప ట్నం, మెళియాపుట్టి, నందిగాం, పలాస మండలాల పరిధిలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నారు.

ఈ నెల నుంచే..

అటవీ ఉత్పత్తుల ధరలను పెంచాలని గిరిజన రైతులు గత కొన్నాళ్లుగా కోరుతున్నారు. ఈ విషయాన్ని కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే గిరిజన కార్పొరేషన్ చైర్మన్ శ్రావణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లాం. దీంతో ప్రభుత్వం ఈ నెల 4 నుంచి రేట్లు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. గిరిజన రైతులు అటవీ ఉత్పత్తులను పెంచుకుంటే మంచిది.

-జి.నర్సింహులు, సీసీసీ మేనేజర్, పాతపట్నం

ధరల పెంపు ఇలా..

పంట	గతేడాది (కిలో)	ఈఏడాది (కిలో)
రాగులు	రూ.22	రూ30
పసుపు కొమ్ములు	రూ.60	రూ.70
రెళ్లతొక్క	రూ.10	రూ.11
ఎండు ఉసిరి	రూ.80	రూ.90
కుంకుడు కాయలు	రూ.20	రూ.35
విప్పపప్పు	రూ.29	రూ.32
కాగుపప్పు	రూ.22	రూ.25
చింతపండు	రూ.32	రూ.34
నల్లజీడిపిక్కలు	రూ.18	రూ.22
ముసిడిక పిక్కలు	రూ.90	రూ.100

(కొండ చీపుర్లను మూడు రకాలుగా విభజించి కిలోకి రూ.10 పెంచారు.)

పసిడికి రెక్కలు



ఇలా పెరగడం ఎన్నడూ చూడలేదు..



బంగారం ధరలు ఈ స్థాయిలో పెరగడం ఎన్నడూ చూడలేదు. మా పెళ్లి నాటికి తులం రూ.1500 లోపే ఉండేది. ఆ రోజుల్లో బంగారు ఆభరణాలు కూడా చాలా ఎక్కువగా స్త్రీలు పెట్టుకునేవారు. ప్రస్తుతం ఆభరణాల వినియోగం తగ్గినా.. ధరలు పెరిగాయి. సామాన్యులకు, మధ్య తరగతి ప్రజలకు అందని స్థాయిలో పెరగడం బాధాకరం.

-సాధు కృష్ణవేణి, గృహిణి, జమ్ము

మరింత పెరిగే అవకాశం..



అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ఔన్స్ ధరలు పెరగడంతో దేశీయ మార్కెట్‌లోనూ పెరిగాయి. అగ్రరాజ్యాలు అనుసరిస్తున్న ఆర్థిక విధానాలతో బంగారంపై పెట్టుబడులు పెట్టే వారు ఎక్కువ కావడం వల్ల భవిష్యత్‌లో ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉంది.

-నానాజీ గాడ్గె, బంగారం వ్యాపారి, నరసన్నపేట

మూడేళ్లు.. తులంపై రూ.30 వేలు

● గత మూడేళ్ల ధరలు పరిశీలిస్తే బంగారం ఏ స్థాయిలో పెరుగుతోందో చూద్దాం.. 2023లో తులం బంగారం రూ.67 వేలు ఉండగా... పది గ్రాముల బంగారం రూ.56,700 (99.9 స్వచ్ఛత) పలికింది. ● 2024 జనవరిలో తులం బంగారం రూ.84 వేలు, పది గ్రాములు రూ.72 వేలు ఉంది. ● ప్రస్తుతం 99.9 స్వచ్ఛత బంగారం పది గ్రాములు రూ.83 వేలు, తులం రూ.97 వేలు ఉంది. ఆర్నమెంట్ (91.6 స్వచ్ఛత) తులం రూ.87 వేలు ఉండగా... పది గ్రాములు రూ.75,650కు చేరింది. మూడేళ్లలో తులం రూ.30 వేలు పెరిగి ఆల్‌టైం రికార్డుకు చేరింది.

కోటబొమ్మాళి మండలం నిమ్మాడకు చెందిన ఒక రైతు రెండేళ్ల కిందట మూడు తులాల బంగారం రూ.1.80లక్షలకు కొనుగోలు చేశాడు. స్థిరాస్తి కొనుగోలు నిమిత్తం ఆ బంగారాన్ని తాజాగా ఒక షాపులో రూ.2.81 లక్షలకు విక్రయించారు. రెండేళ్లలో రూ.లక్ష వరకు ఆదాయం వచ్చింది. ఇలా రైతులతోపాటు వ్యాపారులు, ఉద్యోగులు, ముఖ్యంగా ఉపాధ్యాయులు బంగారంపై పెట్టుబడులు పెట్టడం ప్రారంభించారు. పసిడి ధర పరుగులు పెడుతోంది. దీంతో వంద గ్రాముల చొప్పున బంగారం బిస్కెట్లు కొనుగోలు, అమ్మకాలు ప్రస్తుతం జోరుగా జరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

- 10 గ్రాముల ధర రూ.83 వేలు
- 2020లో రూ.40 వేలు
- 99.9 స్వచ్ఛత బంగారం తులం రూ.97వేలు
- సామాన్యులకు అందని స్థాయిలో పరుగులు
- మదుపరులకు కలిసి వస్తున్న ధరలు

నరసన్నపేట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి)

బంగారం ధరలు రోజురోజుకూ ఆకాశాన్ని తాకుతున్నాయి. 24 క్యారెట్ల బంగారం పది గ్రాములు రూ.83 వేల మార్కు దాటి ఆల్‌టైం రికార్డు సృష్టించింది. గత నాలుగేళ్లతో పోల్చుకుంటే బంగారం ధరలు 100 శాతం పెరిగాయి. 2020 ఏడాదిలో పది గ్రాముల బంగారం రూ.40 వేలు ఉండగా.... ప్రస్తుతం రెట్టింపైంది. బంగారం మీద పెట్టుబడి పెట్టిన వారికి ఇది ఎంతో కలసి వచ్చింది. గత 2 నెల ల్లో ధర పెరుగుతూనే ఉంది. గత ఏడాది జూలై మొదట్లో పది గ్రాముల ధర రూ.69 వేలు ఉండగా... 3 నెలల్లో గ్రాముకు రూ. వెయ్యికి పైగా పెరిగి... అక్టోబరు 20 నాటికి పది గ్రాములు రూ.80వేల మార్కు దాటింది. గత కొద్ది రోజులుగా హెచ్చుతగ్గులు ఉన్న ధరలు జనవరి ఒకటో తేదీ నుంచి గ్రాముకు రూ.100 చొప్పున పెరుగుతూ వచ్చాయి. తాజాగా పది గ్రాములు రూ.83 వేల మార్కు దా టింది. రానున్న రోజుల్లో బంగారం ధర పెరిగే అవకాశం ఉందని బులియన్ మార్కెట్ వ్యాపారులు చెబుతున్నారు. పసిడి పరుగులు పెడుతుండటంతో సామాన్యులు, మధ్య తరగతి వర్గం బెంబేలెత్తుతున్నారు. తులం రూ.లక్ష దాటడం ఇదే మొదటిసారి అని మధ్య తరగతి వర్గం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

పసిడి ధరలు ఇలా..

సంవత్సరం	పది గ్రాములు
1910	రూ.15.50
1920	రూ.18.25
1930	రూ.18.05
1940	రూ.36
1950	రూ.99
1960	రూ.111.56
1970	రూ.184.50
1980	రూ.1330
1990	రూ.3,200
2000	రూ.4,400
2010	రూ.18,500
2020	రూ.40,000
2024	రూ.80,000
2025	రూ.83,000 (జనవరిలో)

జిల్లాలో ఇలా..

జిల్లాలో 650కి పైగా షాపులు ఉన్నాయి. నరసన్నపేట బులియన్ మార్కెట్ పసిడికి పెట్టింది పేరు. నిత్యం రూ.కోట్లలో వ్యాపారం సాగుతుంది. నరసన్నపేట, శ్రీకాకుళంలో 400కు పైగా చిన్న, పెద్ద దుకాణాలు ఉన్నాయి. నరసన్నపేట పట్టణంలో 3 హోల్‌సేల్ దుకాణాలు, 230 వరకు చిన్న, పెద్ద షాపులు ఉన్నాయి. కాశీబుగ్గ, టెక్కలి, సోంపేట, ఆమదాలవలస, బ్రాహ్మణతర్లలో మరో 300 వరకు షాపులు ఉన్నాయి. జిల్లాలో నిత్యం రూ.2 కోట్లకు పైగా వ్యాపారం సాగుతుంది. ధరలు పెరుగుతుండటంలో వ్యాపారాలు సాగడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. ఇటీవల పెళ్లి ముహూర్తాలు ఉండటంతో వ్యాపారాలు సాగే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇక బంగారం బాటలో వెండి కూడా ప్రయాణిస్తోంది. కిలో వెండి ధర రూ.95 వేలకు చేరింది. ఏడాది క్రితం కిలో వెండి రూ.60వేలు ఉండగా 55శాతం మేరకు ధరలు పెరిగాయి.

మదుపరులకు అనుకూలం..

కొవిడ్ తరువాత రియల్ ఎస్టేట్ రంగం కుదేలు కావడంతో మదుపరులు బంగారంపై దృష్టి పెట్టారు. లిక్విడ్ రూపంలో కాకుండా బ్రాండెడ్ రూపంలో కొనుగోలు చేయడం.. వాటి ధరలు ఎక్కువగా ఉన్నప్పుడు అమ్మకాలు చేయడం ఉద్యోగుల్లో పెరిగింది. స్టాక్ మార్కెట్ కంటే బంగారం మీద పెట్టుబడులు పెట్టేందుకు వ్యాపారులు మొగ్గ చూపుతున్నారు. రోజుకు జిల్లాలో కోట్లాది రూపాయలు బంగారం మీదపెట్టుబడి పెడుతున్నారు. రెండేళ్ల క్రితం రూ.లక్ష పెట్టుబడి పెడితే ప్రస్తుతం రూ.1.70 లక్షలు వస్తోంది. వడ్డీరేటుతో పొల్చుకుంటే బంగారం మీద పెట్టుబడి పెట్టడం వల్ల సుమారు 40శాతం వరకు రెట్టింపవుతోంది. బంగారం మరింత ప్రియమయ్యే అవకాశం ఉంది. మరో వైపు అంర్జాతీయ స్థాయిలో బులియన్ మార్కెట్‌లో పెట్టుబడులు పెరగడం వల్ల బంగారం ధరలు పెరుగుతున్నాయిని బులియ విశ్లేషకులు చెబుతున్నారు.

అభివృద్ధికి ఆమడ దూరం!

- 31వ డివిజన్‌లో సమస్యల తిష్ఠ
- కానరాని పక్కా రహదారులు
- కాలువలు లేక రోడ్డుపైకి మురుగునీరు
- పూడుకుపోయిన చాకలి చెరువు
- గంజాయి బ్యాచ్‌కు అడ్డాగా ఖాళీ స్థలాలు

శ్రీకాకుళం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): నగరం నడిబొడ్డునే ఉన్న ఆ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదు. దశాబ్దాల చరిత్ర ఉన్నా.. అక్కడి సమస్యలు మాత్రం పాలకులకు పట్టడం లేదు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని ఏళ్ల తరబడి విన్నవిస్తున్నా.. పట్టించుకునే నాథుడు కరవయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో 31వ డివిజన్‌లో అనేక సమస్యలు తిష్టవేశాయి. ఈ డివిజన్ పరిధిలో సాయినగర్ కాలనీ, పట్నాయక్ కాలనీ, దండివీధి ఉన్నాయి. ఈ డివిజన్ ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందిపడుతున్నారు. ప్రభుత్వం మారి నెలలు గడుస్తోందని.. ఇప్పటికైనా తమ సమస్యలు పరిష్కరించాలని ఆ డివిజన్ ప్రజలు కోరుతున్నారు.


గంజాయి బ్యాచ్‌కు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన సాయినగర్ కాలనీలో ఖాళీస్థలం




పట్నాయక్ కాలనీలోని ఓ వీధి రోడ్డు ఇలా..

పట్నాయక్ కాలనీలో..

ఈ కాలనీ విస్తీర్ణంలో పెద్దదే. ఇక్కడ అన్ని వర్గాలవారు నివసిస్తున్నారు. ఇక్కడ ఉన్న ఖాళీస్థలాల్లో అధికంగా ప్రైవేటువే ఉన్నాయి. ఆయా స్థలాల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు వేకెంట్ ల్యాండ్ కింద పన్నులు వసూలు చేస్తున్నది లేనిది తెలియాల్సి ఉంది. కానీ ఆయా స్థలాలు మినీ చెరువులుగా మారి మురుగునీరు నిల్వతో దుర్గంధం వెదజల్లుతుంది. ఇక రోడ్లకు ఇరువైపులా కొన్నిచోట్ల మాత్రమే కాలువలు ఉన్నాయి. మిగిలిన ప్రాంతాల్లో.. ఇరుకు వీధిల్లో రోడ్లూ నిర్మించలేదు. కాలువలు లేకపోవడంతో ప్రతి ఇంటిముందర.. మురుగునీటి గుంతలు వెలిశాయి. దీంతో దోమల మోత విపరీతంగా ఉంది. అక్కడక్కడా ఉన్న కాలువలను శుభ్రం చేసిన దాఖలాలు లేవు. వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. రాత్రిపూట బయటకు రావాలంటే భయపడుతున్నారు. వీధి కుక్కల బెడద లేకుండా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు. అలాగే గత ప్రభుత్వ హయాంలో సీసీ రోడ్లు నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి.. రోడ్డు పనులు చేపట్టకుండా వదిలేశారని.. మౌలిక వసతులు మెరుగుపరచాలని కాలనీవాసులు కోరుతున్నారు.


ప్రైవేట్ స్థలాల్లో చేరిన మురుగునీరు

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

జిల్లా పరిషత్‌కు సమీపాన మహిళా పోలీసు స్టేషన్ వెనుక సాయినగర్ కాలనీ ఉంది. కాలనీ ఎంట్రన్స్‌లో భారీవిస్తీర్ణంలో ప్రైవేటు స్థలం ఉంది. ఈ ప్రాంతం గంజాయి, మందు బాబులకు అడ్డాగా మారింది. రాత్రి పూట అటుగా రావాలంటే.. మహిళలు, విద్యార్థినులు భయాందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతంపై పోలీసులు నిఘా పెట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు. అలాగే కాలనీలో ఉన్న చాకలి చెరువు పూడుకుపోయింది. చెరువు నిండా పిచ్చి మొక్కలు పెరగడం, మురుగునీరు చేరడంతో పందులు, పాములకు ఆవాసం మారింది. ఇళ్లల్లోకి విష సర్పాలు చొరబడిన ఘటనలు ఉన్నాయి. కాలనీలో పక్కా రోడ్లు లేవు. కాలువలు లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే నిలిచిపోతుంది. నిర్మించకపోవడంతో.. వీల్లేని పరిస్థితిల్లో ఎక్కడికక్కడే నీరు నిలిచిపోతుంది. పందులు మరింతగా గోతులు చేసి అధ్వానంగా మారుస్తున్నాయి. కొంతమంది మున్సిపల్ కొళాయిలకు మోటార్లు అమర్చడంతో దీనివల్ల పూర్తిస్థాయిలో తాగునీరు అందక ఇబ్బందిపడుతున్నారు. వీధి లైట్లు కూడా పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఇబ్బందిపడుతున్నారు. డ్రైనేజీ అధ్వానంగా ఉండడంతో దోమలు, పందుల బెడద ఎక్కువగా ఉంది.


దండి వీధిలో కానరాని పక్కా రహదారి.. మురుగు కాలువ దుస్థితి

'దండీ'గా ఇబ్బందులు

ఈ ప్రాంతంలో దండిగా ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. దోమల మోతతో ఇబ్బందులకు గురవుతున్నామని.. కాలువలు లేక.. మురుగునీటి నిల్వ వల్ల వ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. పక్కా రోడ్లు లేక ప్రజల ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికైనా ఇక్కడి సమస్యలను ప్రజాప్రతినిధులు గుర్తించాలని కోరుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థను దండివీధిలో సరిదిద్దాలని.. అంతటా మురుగునీటికి ఆటంకం లేకుండా కాలువలను నిర్మించాలని విన్నవిస్తున్నారు. పందులు గుంపులుగా వీధుల్లో తిరుగుతున్నాయని.. వీధి కుక్కలతో భయాందోళన చెందుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దండివీధిలో సీసీ రోడ్లు నిర్మించి ఇబ్బందుల్లేకుండా చూడాలని ప్రజాప్రతినిధులను, అధికార యంత్రాంగాన్ని స్థానికులు కోరుతున్నారు.


ఖాళీస్థలాల్లో పందుల స్వైర విహారం


సాయినగర్ కాలనీలో చెరువును శుభ్రంచేసి పార్కుగా మార్చాలని కోరుతున్న స్థానికులు

చెరువును అభివృద్ధి చేయాలి



వార్డు పరిధిలోని చాకలి చెరువు మురుగునీరు చేరిపోవడంతో పాములు, పందులకు ఆవాసంగా మారింది. ఈ సమస్యపై అధికారులకు విన్నవించాం. చెరువును శుభ్రంచేసి పార్క్‌గా అభివృద్ధి చేయాలి

- విభూది సూరిబాబు, 31వ డివిజన్

ఇబ్బందులు గుర్తించాలి



ఖాళీస్థలాల్లో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు దృష్టిసారించాలి. తాగునీటి కొళాయిల నుంచి సక్రమంగా నీరు వచ్చేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలి. మా ప్రాంతంలో రోడ్లు, కాలువలు నిర్మించాలి. వీధి కుక్కల బెడదను తొలగించాలి.

- జి.చంద్రభూషణం, సాయినగర్ కాలనీ

చెరువుల్లా ఖాళీ స్థలాలు



మా కాలనీలో ఉన్న ఖాళీ స్థలాల్లో మురుగునీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. కాలనీలోని కొన్ని వీధుల్లో పక్కా రోడ్లు లేక ఇబ్బందిపడుతున్నాం. గత ప్రభుత్వంలో కొబ్బరి కాయ కొట్టి పనులు చేపట్టలేదు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి కాలనీలోని సమస్యలు పరిష్కరించాలి.

- వి.సతీష్, పట్నాయక్ కాలనీ


అరసవల్లి: జెండాను ఎగురవేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట


ఎచ్చెర్ల: బీఆర్ఏయూలో జెండాను ఎగురవేస్తున్న వీసీ రజని

కలెక్టరేట్‌లో గణతంత్ర వేడుకలు


కలెక్టరేట్ వద్ద గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయ ఆవరణలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రత్యేక కలెక్టర్ పద్మావతి, కార్యాలయ ఏవో సూర్యనారాయణ, సెక్షన్ సూపరింటెండెంట్లు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ జిల్లా కార్యాలయంలో..

తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు కలమట వెంకటరమణ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పీఎంజే బాబు, సింతు సుధాకర్, కొమ్మనాపల్లి వెంకటరామరాజు, బొనిగి భాస్కరరావు, కలగ జగదీష్, పాండ్రంకి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ యూనివర్సిటీలో..

ఎచ్చెర్ల, జనవరి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేడ్కర్ యూనివర్సిటీలో వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు నిర్వహించారు. వర్సిటీ రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, ఎస్‌వో ఎస్.సామ్రాజ్యలక్ష్మి, వర్సిటీ ప్రిన్సిపాల్లు ఎస్.ఉదయభాస్కర్, ఎం.అనూరాధ, సీహెచ్ రాజశేఖరరావు, ఓఎస్‌డీ యు.కావ్యజ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో..

ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో డైరెక్టర్ ప్రొఫెసర్ కేవీజీడీ బాలాజీ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో ఏవో ముని రామకృష్ణ, డీన్ కొర్ల మోహనకృష్ణ చౌదరి, వెల్ఫేర్ డీన్ గేదెల రవి తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి కార్యాలయంలో...

ఎచ్చెర్ల, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలోని ఆంధ్రజ్యోతి శ్రీకాకుళం యూనిట్ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని బ్రాంచ్ మేనేజర్ ఆర్.సోమశంకరరావు ఎగురవేశారు. కార్యక్రమంలో వివిధ విభాగాల ఇన్‌చార్జిలు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్చక సంక్షేమ సంఘ ఉపకోశాధికారిగా వినోద్



సోంపేట, జనవరి 26(ఆంధ్రజ్యోతి): అర్చక సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపకోశాధికారిగా గొల్లగండి గ్రామానికి చెందిన వినోద్‌కుమార్ పాణిగ్రాహిని ఎన్నుకున్నారు. విజయవాడ లబ్బీపేట వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ మేరకు బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వేమూరి ఆనంద్, దుర్వాసుల రామశాస్త్రి చేతులమీదుగా నియామకపత్రం అందుకున్నారు.

జాతీయస్థాయి విలువిద్య పోటీలకు తేజేశ్వరరావు


నల్లి తేజేశ్వరరావు

ఎచ్చెర్ల, జనవరి 26(ఆంధ్రజ్యోతి): చిన్నప్పటి నుంచి వివిధ పోటీల్లో ఆసక్తి చూపుతున్న నల్లి తేజేశ్వరరరావు జాతీయ స్థాయి విలువిద్య(ఆర్చరీ) పోటీలకు ఎంపికై సత్తాచాటాడు. ఎచ్చెర్లలో నివాసం ఉంటున్న జి.సిగడాం మండలం నల్లిపేటకు చెందిన రిటైర్డు ఆర్మీ ఉద్యోగి నల్లి మల్లేశ్వరరావు, వసంత లక్ష్మి (బిజినెస్ ఉమెన్) దంపతుల చిన్న కుమారుడైన తేజేశ్వరరావు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కన్పరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. పరవాడ (విశాఖ)లోని సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న తేజేశ్వరరావు చిన్నప్పటి నుంచి విలువిద్య పట్ల ఆసక్తి చూపుతున్నాడు. విశాఖలో ఈ నెల 10న జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో, అలాగే ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూనియర్ ఇండియన్ రౌండ్ విభాగంలో పాల్గొని జూనియర్ నేషనల్ పోటీలకు ఎంపికయ్యాడు.

జెమ్స్ కళాశాలలో గణతంత్ర వేడుకలు


జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జెమ్స్ ప్రిన్సిపాల్ లక్ష్మి లలిత

అరసవల్లి/అర్బన్, జనవరి 26(ఆంధ్రజ్యోతి): రాగోలు జెమ్స్ కళాశాలలో ఆదివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీలలిత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల వైద్యులు రామారావు, అకడమిక్ డైరెక్టర్ కె.సుధీర్, డాక్టర్ రాజేష్‌బాబు, డాక్టర్ రవితేజ, డాక్టర్ రవికుమార్, ఫిజియోథెరపీ ప్రిన్సిపాల్ రాహుల్ షేక్, ఏవో సత్యనారాయణ, వ్యాయామోపాధ్యాయులు జగదీశ్వరరావు, జి.రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను అభివృద్ధి పథంలో నడుపుదాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

జి.సిగడాం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి పథంలో నడిపేందుకు చర్యలు తీసుకోవటం జరుగుతుందని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. ఆదివారం డీఆర్ వలసలో ఆయన పర్యటించారు. ఇటీవల నిర్మాణాలు చేపట్టిన సీసీ రహదారులు, డ్రైనేజీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ హయాంలో ప్రతీ గ్రామానికి రహదారి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే ఇటీవల ప్రమాదంలో గాయపడి శస్త్రచికిత్స చేయించుకున్న మాజీ సర్పంచ్ కుమరాపు అప్పన్నను పరామర్శించారు. కూటమి నాయకులు కుమరాపు రవికుమార్, పైల విష్ణుమూర్తి, బూరాడ వెంకటరమణ, టంకాల మౌళీశ్వరరావు, వజ్జపర్తి రఘురాం తదితరులు ఉన్నారు.

విద్యారంగాన్ని బలోపేతం చేద్దాం

గుజరాతీపేట, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు పోరాడదామని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం యూనియన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ ఉద్యమం నుంచి ఆశా కార్యకర్తల వరకు, ఉపాధ్యాయ ఉద్యమం నుంచి ఉద్యోగుల పీఆర్సీ వరకు ప్రతి సమస్యపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందువల్ల రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కె.విజయగౌరిని బలపర్చాలన్నారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్‌కుమార్, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, కె.దాలయ్య, బి.రవికుమార్, సీహెచ్ రవీంద్ర, జి.గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

అరసవల్లి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్లు తక్షణమే రద్దు చేయాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం శ్రీకాకుళం నగరంలో కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. 13 నెలల రైతు ఉద్యమం కారణంగా ఇచ్చిన వాగ్దానాలను పూర్తిగా విస్మరించడం దుర్మార్గమని దుయ్యబట్టారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, సీఐటీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సింహాచలం, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

విశ్వ బ్రాహ్మణ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా 'లోలుగు'



ఆమదాలవలస, జనవరి 26(ఆంధ్రజ్యోతి): మండల విశ్వ బ్రాహ్మణ ఉద్యోగుల సంఘానికి రెండోసారి అధ్యక్షుడిగా స్థానిక మున్సిపల్ పాఠశాల రిటైర్డు హెచ్‌ఎం లోలుగు విశ్వేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలో ఉన్న మున్సిపాల్ ప్రాథమిక పాఠశాల వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన ఈ ఎన్నికల్లో ఈయనతో పాటు కార్యదర్శులు దుప్పలపూడి శ్రీనివాసరావు, మండా వెంకటరమణ ట్రెజరర్‌గా టీకే గోపాలకృష్ణలను ఈ సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఎన్నికల అధికారి చంద్రమౌళి తెలిపారు.

డాగ్ స్క్వాడ్ తనిఖీలు

బూర్జ, జనవరి 26(ఆంధ్రజ్యోతి): మండలంలో రద్దీగా ఉన్న ప్రదేశాలు, షాపుల్లో ఎస్ఐ ప్రవల్లిక ఆధ్వర్యంలో డాగ్‌తో తనిఖీలు ఆదివారం చేపట్టారు. ఎస్ఐ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలకు బానిసలైన యువతపై ప్రత్యేక శ్రద్ధతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. యువత గంజాయి, మద్యానికి బానిసలై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు.

ఆదిత్యుని ఆదాయం రూ.1.96లక్షలు

అరసవల్లి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారికి ఆదివారం ఒక్కరోజు రూ.1,96,139 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ.49,500, విరాళాల ద్వారా రూ.50074, ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.96,560 ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో వై.భద్రాజీ తెలిపారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు

గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సేవకులకు ఆదివారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రశంసా పత్రాలు అందించారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, ఎమ్మెల్యే శంకర్ అభినందించారు.
అరసవల్లి/అర్బన్ (ఆంధ్రజ్యోతి)



ఎస్.కృష్ణమూర్తి, ఎస్ఈ, ఏపీఈపీడీసీఎల్ | డా.కల్యాణ్‌బాబు, డీసీహెచ్ఎస్ | బి.భారతి సౌజన్య, డీపీవో | బి.సుధాకరరావు, పీడీ, డ్వామా | పి.కిరణ్‌కుమార్, పీడీ, డీఆర్డీఏ



డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావుకు ప్రశంసాపత్రం అందిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, చిత్రంలో ఎస్పీ మహేశ్వరరెడ్డి, ఎమ్మెల్యే గొండు శంకర్



డాక్టర్ వి.సన్యాసిరావు, జిల్లా జైలు సూపరింటెండెంట్ | బి.పద్మావతి, ఉప కలెక్టర్ | జీఏ.సూర్య నారాయణరావు, ఏవో, కలెక్టరేట్ | బి.రాజేశ్వరరావు, సూపరింటెండెంట్, సి-సెక్షన్, కలెక్టరేట్ | కె.సాయి ప్రత్యూష, ఆర్డీవో శ్రీకాకుళం | ఎం.కృష్ణమూర్తి, ఆర్డీవో, టెక్కలి | నర్సింహసాహు డ్రైవర్, తహసీల్దారు, శ్రీకాకుళం | సంతోష్, డిప్యూటీ తహసీల్దారు, కంచిలి | జె.గోవిందరాజులు దఫేదారు, జేసీ, కలెక్టరేట్ | ఎస్.కిరణ్‌కుమార్, తహసీల్దారు, పాతపట్నం | ఎం.అవతారం, సీఐ, జేఆర్.పురం | పి.తులసమ్మ, డబ్ల్యుహెచ్‌సి, శ్రీకాకుళం



యు.నరేష్‌కుమార్, పీసీ, ట్రాఫిక్ | సీహెచ్ హరీష్‌కుమార్, పీసీ, సీసీఎస్ | వైవి.రమణ, హెచ్‌సీ, టాస్క్‌ఫోర్స్ | ఎల్.ఉదయలక్ష్మి, డేటా ఎంట్రీ ఆపరేటర్, దివ్యాంగుల శాఖ | ఎం.వెంకటప్పారావు, పీసీ, ఏసీబీ | డా.పి.సుధీర్‌కుమార్, మున్సిపల్ హెల్త్ అధికారి | ఉమామహేశ్వరరావు, ఏవో, అటవీశాఖ | బి.ప్రసాదరావు, సీఐ, కోస్టల్ సెక్యూరిటీ, కళింగపట్నం | కె.కృష్ణచైతన్య, డీఆర్వో సీసీ | జి.రమణ, దఫేదారు, కలెక్టరేట్ | కె.శ్రీనివాసరావు, పీసీ, ఎచ్చెర్ల | జగన్మోహనరావు చైర్మన్, రెడ్‌క్రాస్ శ్రీకాకుళం

క్రైం కార్నర్ బొబ్బిలిపేటలో ఒకరి హత్య



రోదిస్తున్న కుటుంబ సభ్యులు, (ఇన్‌సెట్‌లో) హత్యకు గురైన చంద్రయ్య(ఫైల్)

ఆమదాలవలస, జనవరి 26(ఆంధ్రజ్యోతి): బొబ్బిలిపేట గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త గురుగుబిల్లి చంద్రయ్య (48) శనివారం రాత్రి హత్యకు గురైనట్టు ఎస్ఐ సనపల బాలరాజు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళంలో ఇంటర్మీడియట్ చదువుతున్న తన కుమార్తె ఆమదాలవలసలో బస్సు దిగి ఫోన్ చేయగా.. తీసుకు వచ్చేందుకు శనివారం సాయంత్రం 6.30 గంటల సమయంలో ఇంటి నుంచి బైక్‌పై చంద్రయ్య వెళ్లాడు. అయితే ఎంతకి పాప దగ్గరికి వెళ్ల పోవడంతో పాటు తిరిగి ఇంటికి రాలేదు. దీంతో భార్య ఈశ్వరమ్మ, బంధువులు చంద్రయ్య కోసం గాలించగా.. అర్ధరాత్రి సమయానికి గ్రామ సమీపంలోని బగ్గోడి చెరువు గట్టు దిగువున ఉన్న పొలంలో విగత జీవిగా కనిపించాడు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా.. ఆదివారం ఉదయం శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద, ఆమదాల వలస, శ్రీకాకుళం వన్ టౌన్ సీఐలు పి.సత్యనారాయణ, పైడిపునాయుడు క్లూస్ టీమ్‌తో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. మృతదేహం తలపై బలమైన గాయాలతో పాటు శరీరంపై చిన్న చిన్న గాయాలు ఉన్నట్టు గుర్తించారు. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. హత్యకేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. హత్యకు గల కారణాలు తెలియరాలేదని, అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్టు స్పష్టం చేశారు.

ఘటనా స్థలంలో బీరు సీసాలు

చంద్రయ్య మృతదేహం ఉన్న పరిసర ప్రాంతాల్లో ఖాళీ బీరుసీసాలు, మరికొద్ది దూరంలో మాదక ద్రవ్యాల ఆనవాళ్లు ఉన్నాయి. హంతకులు మద్యం, గంజాయి తాగి హత్యకు పాల్పడినట్టు గ్రామస్థులు, కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



త్రినాథరావు (ఫైల్)

రణస్థలం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): దేరసాం గ్రామానికి చెందిన కె.త్రినాథరావు(45) గ్రామ సమీపంలో ఉన్న ఒక తోటలో ఆదివారం మృతి చెందాడు. ఈయన మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జేఆర్ పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపిన వివరాల మేరకు.. త్రినాథరావు మండల కేంద్రంలోని ఒక హోటల్‌లో కుక్‌గా పని చేస్తున్నాడు. శనివారం ఉదయం హోటల్‌కి వెళ్తానని ఇంటి నుంచి బయలుదేరి వెళ్లిన త్రినాథరావు ఆదివారం మధ్యాహ్నం వరకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. అయితే గ్రామానికి సమీపంలో ఒక షాపు వద్ద బైక్ పార్కింగ్ చేయడం గమనించిన కటుంబ సభ్యులు సమీప తోటలో త్రినాథరావు మృత దేహాన్ని గుర్తించారు. త్రినాథరావు నోటి నుంచి రక్తపు నురగలు, శరీరం కమిలి ఉండడంతో కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని క్లూస్ టీమ్ పరిశీలించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కాగా త్రినాథరావుకి భార్య కె.శారద, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

24 మద్యం సీసాలు స్వాధీనం

మెళియాపుట్టి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): జాడుపల్లి గ్రామానికి చెందిన నిక్కల అప్పలస్వామి ఆదివారం రాత్రి 24 మద్యం సీసాలు తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ పి.రమేష్‌బాబు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

● పాతపట్నం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): రొమదళ గ్రామానికి చెందిన రామారావు మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తూ ఆదివారం పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి నుండి నాలుగు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ బి.లావణ్య తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య



ఉరికి వేలాడుతున్న జానకిరావు

హరిపురం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): మందస మండలం లోహరిబంద గ్రామానికి చెందిన తాళ్ల జానికిరావు(55) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. జానకిరావు బెంగు ళూరులో పని చేస్తూ ఇటీవల సంక్రాంతికి ఇంటికి వచ్చాడు. రోజూ మద్యం తాగి ఇంటికి వస్తుండగా భార్య, పిల్లలు శనివారం మందలించారు. దీంతో మనస్తా పానికి గురై ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. ఆయన ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతుకుతూ.. ఆదివారం తమ తోటలోకి వెళ్లగా అక్కడ పనస చెట్టుకు ఉరి వేసుకొని కనిపించాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమార్తెలకు వివాహం కాగా, కుమారుడు విశాఖలో చదువుతున్నాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం హరిపురం సీహెచ్‌సీలో నిర్వహించారు. భార్య కమలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మృతుడు కాశీబుగ్గకు చెందిన వ్యక్తి



శ్రీనివాసరావు(ఫైల్)

పలాస, జనవరి 26(ఆంధ్రజ్యోతి): కోసంగిపురం ప్రభుత్వ గృహ సముదాయం సమీపంలోని పొలాల్లో ఉన్న మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి కాశీబుగ్గ ఎస్సీ కాలనీకి చెందిన లండ శ్రీనివాసరావుగా కుటుంబ సభ్యులు గుర్తించారు. శనివారం రాత్రి మృతదేహాన్ని కాశీబుగ్గ పోలీసులు స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈయన పారిశ్రామిక వాడలో జీడి కార్మికుడిగా పనిచేస్తు శనివారం రాత్రి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. మృతదేహం శరీరం, తలపై దెబ్బలున్నట్లు స్థానికులు గుర్తించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేయాలని ఆయన బంధువులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం చేసిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. సీఐ పి.సూర్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగదు బదిలీ

పాతపట్నం, జనవరి 26(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టి మండలం వసుంధర గ్రామానికి చెందిన లక్ష్మీనాయక్ టీడీపీ రెండేళ్ల కాల పరిమితికి సభ్యత్వానికి బదులు శాశ్వత సభ్యత్వం నమోదు కావడంతో రూ.లక్ష పార్టీ అకౌంట్‌కు ఫోన్‌పే ద్వారా జమ్మైపోయింది. నిరుపేద అయిన సదరు వ్యక్తి తన నగదును తిరిగి ఇప్పించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావును కోరారు. దీనికి ఆయన స్పందించి పార్టీ నేతలతో చర్చించగా సాంకేతిక సమస్యను పరిష్కరించి నగదు ఇస్తామని చెప్పడంతో సదరు మొత్తాన్ని లక్ష్మీనాయక్ అకౌంట్‌కు ఆదివారం ఎమ్మెల్యే ముందస్తుగా బదిలీ చేశారు. దీంతో లక్ష్మీనాయక్ హర్షం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

బాలకృష్ణకు పద్మభూషణ్ హర్షణీయం: బగ్గు

నరసన్నపేట, జనవరి 26(ఆంధ్రజ్యోతి): తెలుగు సినీచరిత్రలో తండ్రికి మించిన కుమారుడిగా తన నటనతో తెలుగు ప్రేక్షకుల మన్ననలు పొందిన ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ ప్రకటించడం హర్షణీయమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. నాడు అన్న ఎన్టీఆర్ పద్మభూషణ్ పొందగా నేడు కుమారుడు బాలయ్య కూడా అదే అవార్డు పొందడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణింకి కృష్ణంనాయుడు, టీడీపీ నేతలు బగ్గు అర్చన శిమ్మ చంద్రశేఖర్, గొద్దు చిట్టిబాబు, ఉణ్న వెంకటేశ్వరరావు, పీస కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

జలుమూరు (సారవకోట), జనవరి 26 (ఆంధ్రజ్యోతి): 'నేను నా జన్మభూమి బుడితి' పుస్తకం భావితరాల వారికి ఆదర్శమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బుడితి గ్రామానికి చెందిన నిక్కు అప్పన్న రచించిన ఈ పుస్తకాన్ని స్థానిక ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బుడితి గ్రామంతో తనకు చాలా సన్నిహిత సంబంధాలున్నాయన్నారు. బుడితి గురించి అప్పన్న రాసిన పుస్తకం ఎంతో విలువైనదన్నారు. కార్యక్రమంలో ఎంపీ పీ చిన్నాల కూర్మినాయుడు, సర్పంచ్ శంకరరావు, టీడీపీ నాయకులు ధర్మాన తేజకుమార్, కత్తిరి వెంకటరమణ, బైరి భాస్కరరావు, పి.వేణుగోపాలరావు, నిక్కు హరిసత్యనారాయణ పాల్గొన్నారు.

త్వరలో నిజాలు బయటకు వస్తాయి: కలమట

ఎల్.ఎన్.పేట, జనవరి 26(ఆంధ్రజ్యోతి): వైసీపీనేత విజయసాయిరెడ్డి తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడం వెనుక ఉన్న నిజాలు త్వరలో బయటపడతాయని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి అన్నారు. మోదుగవలస జంక్షన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో స్థాయికి మించి రాజకీయాలు చేసి సంపాదించి అక్రమాస్తులను కాపాడుకునేందుకే రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారన్నారు. అక్రమాలు బయటకు రాకుండా కాపాడుకోవచ్చనే ఉద్దేశంతో రాజీనామా చేయడం విడ్డూరంగా ఉందన్నారు. విజయసాయి రెడ్డి కూడబెట్టుకున్న ఆస్తులను కాపాడుకునేందుకు ఎన్ని డ్రామాలాడినా ప్రభుత్వం చట్టపరంగా చర్యలు చేపట్టి ప్రభుత్వ ఆస్తులను కాపాడుతుందన్నారు. కూటమి నాయకులు జి.రాము, టి.అప్పన్న, ఎ.జోగారావు,రాంప్రసాద్ పాల్గొన్నారు.

పాఠశాల వద్ద పరిశుభ్రం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మెళియాపుట్టి, జనవరి, 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాఠశాల సమీపంలో ఆదివారం పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'లో 'నాలుగురోజులుగా కలుషిత నీరు' కథనం రాగా పంచాయతీ కార్యదర్శి అప్పారావు స్పందించారు. కాలువ నీటి వల్ల బోరు నీరు కలుషితం అవుతోందని గుర్తించి మురుగునీటిని మళ్లించారు. పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ చిన్నబాబు, హెచ్‌ఎం గణపతిరావు, వాసు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పీఎఫ్‌ఏఎంని తిరస్కరించాలి

కాశీబుగ్గ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): దేశంలో వ్యవసాయ మార్కెట్లను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ఉద్దేశించిన జాతీయ విధాన కార్యాచరణ (ఎన్‌పీఎఫ్‌ఏఎం)ను తిరస్కరిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని వామపక్షాలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. ఆదివారం గణతంత్ర వేడుకల సందర్భంగా కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు బాలకృష్ణ, సన్యాసిరావు, రామారావు, వినోద్, కుసుమ, గోపి, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

యువత రక్తదానం

టెక్కలి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): అభయం యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్ర ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా పలు వురు యువకులు రక్తదానం చేసి స్ఫూర్తిగా నిలవడం అభినందనీయమని సంఘ అధ్యక్షుడు దేవాది శ్రీనివాసరావు తెలిపారు. కార్య దర్శి లాడి కామేశ్వరరావు జిల్లా కేంద్ర ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

దేశ రక్షణకు పాటు పడాలి

జలుమూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణకు, సమాజ సంక్షేమానికి ప్రతి ఒక్కరు పాటు పడాలని విజయనగరం ఆర్ఎస్ఎస్ విభాగ్ కుటుంబ ప్రబోధన ప్రముఖ్ అర్జున్‌పాత్రో అన్నారు. చల్లవానిపేటలో రిపబ్లిక్ డే సందర్భంగా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలతో ఆదివారం పథ సంచలనం కార్యక్రమం నిర్వహించారు. గ్రామం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు ఉమేష్, పున్నయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మదన్‌కుమార్



టెక్కలి, జనవరి 26(ఆంధ్రజ్యోతి): అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా తొలుసూరుపల్లికి చెందిన సిగిలపల్లి మదన్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఏబీవీపీ రాష్ట్ర ప్రతినిధుల నుంచి లేఖ వచ్చిందన్నారు. విద్యార్థి సమస్యల పరిష్కారానికి పాటు పడతానన్నారు. మదన్ కుమార్ ఎంపికపై పలువురు విద్యార్థి సంఘ నాయకులు హర్షం వ్యక్తంచేసి అభినందించారు.

వాడవాడలా 'గణ' సంబరం

గణతంత్ర దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, కోర్టులు, స్వచ్ఛంద సంస్థల కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగుర వేశారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.
-ఆంధ్రజ్యోతి బృందం



టెక్కలి: సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఆర్డీవో కృష్ణమూర్తి



పాతపట్నం: జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో, చిత్రంలో ఎమ్మెల్యే గోవిందరావు



నరసన్నపేట: టీడీపీ కార్యాలయంలో జెండాను ఎగురు వేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



అరసవల్లి: కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో..



శ్రీకాకుళం కలెక్టరేట్: డీసీసీబీ కార్యాలయంలో..



నరసన్నపేట పట్టణంలో 400 అడుగుల జాతీయ పతాకంతో శ్రీజ్ఞానజ్యోతి పాఠశాల విద్యార్థులు



శ్రీకాకుళం క్రైం: జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో..



కోటబొమ్మాళి: జూనియర్ సివిల్ కోర్టు వద్ద చాక్లెట్లు పంచుతున్న న్యాయాధికారి ప్రసన్నలత



ఆమదాలవలస: లక్ష్మీనగర్ పాఠశాలలో దేశ నాయకుల వేషధారణలో చిన్నారులు



బూర్జ: పెద్దపేట సచివాలయం వద్ద మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణనాయుడు



ఎచ్చెర్ల: ఎన్‌ఏసీఎల్‌లో జెండా ఆవిష్కరిస్తున్న వైస్ ప్రెసిడెంట్ శేషగిరిరావు



ఇచ్ఛాపురం: కోర్టు ఆవరణలో జెండా ఎగురవేస్తున్న న్యాయాధికారి షరీఫ్‌కుమార్



పొందూరు: కోర్టు ఆవరణలో జెండా ఎగురవేస్తున్న న్యాయాధికారి జ్యోత్స్న



గుజరాతీపేట: బీజేపీ జిల్లా కార్యాలయంలో...



పలాస: మునిసిపల్ కార్యాలయంలో



అరసవల్లి: డీఐపీఆర్వో కార్యాలయంలో..



సోంపేట: జెండా ఎగురవేస్తున్న జిల్లా అదనపు న్యాయాధికారి కిశోర్‌బాబు